# రామగుండం 'రెండు' కానుందా?

**డీలిమిటేషన్ సెగ..**
**పారిశ్రామిక క్షేత్రంలో పొలిటికల్ హీట్**
**పదిహేనేళ్లలో 80 వేల ఓట్లు పెరుగుదల.. పాత లెక్కలు ఇక చెల్లకు!**
**ఒకటి 'జనరల్'.. మరొకటి 'ఎస్సీ' రిజర్వ్‌డ్?**
**మండలాల విలీనంపై ఊహాగానాలు.. నేతల్లో మొదలైన గుబులు**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

సింగరేణి బొగ్గు గనుల సాక్షిగా.. రామగుండం రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ పారిశ్రామిక వాడల్లో సరికొత్త చర్చకు తెరలేపింది. జనాభా పెరుగుదల, ఓటర్ల సంఖ్యలో భారీ మార్పుల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గాన్ని రెండుగా విభజించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన ఈ నియోజకవర్గంలో సరికొత్త సమీకరణాలు తెరపైకి రానున్నాయి.

అమాంతం పెరిగిన ఓట్లు!:?2009లో డీలిమిటేషన్ తర్వాత ఏర్పడిన రామగుండం నియోజకవర్గం, గత పదిహేను ఏళ్లలో ఊహించని రీతిలో విస్తరించింది. 2009 తొలి ఎన్నికల సమయంలో కేవలం 1.35 లక్షల ఓట్లు ఉండగా, నేడు ఆ సంఖ్య 2.14 లక్షలకు చేరుకుంది. అంటే దాదాపు 80 వేల మంది కొత్త ఓటర్లు వచ్చి చేరారు. గోదావరిఖని, రామగుండం పట్టణాల్లో పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక విస్తరణే ఇందుకు ప్రధాన కారణమని గణాంకాలు చెబుతున్నాయి.




ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో పరిపాలన, ఎన్నికల నిర్వహణ సౌలభ్యం కోసం దీనిని రెండుగా చీల్చడం అనివార్యమని విశ్లేషకులు భావిస్తున్నారు.

**కొత్తగా 'అర్బన్'.. 'రూరల్'!:**

ప్రస్తుత చర్చల ప్రకారం రామగుండం నియోజకవర్గాన్ని అర్బన్, రూరల్ భాగాలుగా విభజించే అవకాశం ఉంది.

రామగుండం అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన డివిజన్లు, పారిశ్రామిక కాలనీలతో కూడిన ఈ ప్రాంతం 'జనరల్' కేటగిరీలో కొనసాగే అవకాశం ఉంది.

రామగుండం రూరల్: అంతర్గాం, పాలకుర్తి మండలాలతో పాటు రామగుండం శివారు ప్రాంతాలను కలిపి కొత్త నియోజకవర్గంగా ఏర్పాటు చేయొచ్చు. దీనిని 'ఎస్సీ రిజర్వ్‌డ్' చేసే అవకాశం ఉందన్న ప్రచారం ఎస్సీ సామాజిక వర్గ నేతల్లో ఆశలు రేకెత్తిస్తోంది.

**మారుతున్న పొలిటికల్ మ్యాప్!:**

రామగుండం ఎప్పుడూ విలక్షణమైన తీర్పునే ఇస్తుంది. ఇక్కడ ఏ ఒక్క పార్టీకి శాశ్వత కోటలు లేవు. 2014లో బీఆర్ఎస్ గెలిస్తే, 2018లో స్వతంత్ర అభ్యర్థి కోరుకంటి చందర్ గెలిచి చరిత్ర సృష్టించారు. 2023లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇప్పుడు నియోజకవర్గం రెండుగా చీలితే.. పాత ఆధిపత్య పోరు కాస్తా రెండు సీట్లకు మారుతుంది. పాత మండలాల నేతలు తమ పట్టు నిలుపుకోవడానికి ఇప్పటి నుంచే కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు.

మేడారం, ధర్మపురి విలీనంపై ఉత్కంఠ!:?ధర్మపురి నియోజకవర్గంలోని మేడారం వంటి ప్రాంతాలను రామగుండం రూరల్‌లో కలిపే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒకవేళ ఇదే జరిగితే రామగుండం పొలిటికల్ మ్యాప్ పూర్తిగా మారుతుంది. అటు పార్టీల అధిష్టానాలు కూడా ఈ మార్పుల ఆధారంగానే రాబోయే ఎన్నికల కోసం కొత్త అభ్యర్థుల వేటను ప్రారంభించాయి.

# వివక్ష ఉన్నంత కాలం రిజర్వేషన్లు కొనసాగాల్సిందే!

**కులం పేరిట అణచివేస్తూ.. హక్కుల కాలరాస్తారా?**
**ఈడబ్ల్యూఎస్ కు వర్తించని 50% నిబంధన.. ఎస్సీలకు ఎందుకు?**
**సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

దేశంలో తరతరాలుగా కొనసాగుతున్న కుల వివక్ష అంతం కానంత వరకు రిజర్వేషన్లపై మాట్లాడే నైతిక హక్కు ఎవరికీ లేదని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్ స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ఎన్ని తరాలు ఉండాలంటూ ప్రశ్నించే మేధావులు, పాలకులు.. మరి కుల వివక్ష ఎన్ని తరాలు కొనసాగుతుందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, దళిత క్రైస్తవుల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు మరియు ప్రస్తుత సామాజిక పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యాంగ విరుద్ధమైన తీర్పులు: "ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఇచ్చిందే సామాజిక వివక్ష ఆధారంగా. ఆ వివక్ష నేటికీ తొలగిపోలేదు. కానీ, కొన్ని శక్తులు కావాలనే రిజర్వేషన్లపై విషం చిమ్ముతున్నాయి. జనాభాలో కేవలం 5 శాతం లోపు ఉన్న అగ్రవర్ణాల పేదలకు ( ఈ డబ్ల్యూ ఎస్) 10 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు 50 శాతం నిబంధన గుర్తుకురాని కోర్టులకు, బీసీలకు 42 శాతం కోటా అంటే మాత్రం స్టేలు ఇస్తూ అడ్డుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి?" అని నగేష్ ప్రశ్నించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని ఆయన విమర్శించారు.మతం మారితే కులం పోతుందా?: దళిత క్రైస్తవుల అంశంపై స్పందిస్తూ.. "ఒక వ్యక్తి మతం మారినంత మాత్రాన సమాజం అతన్ని చూసే కోణం మారుతుందా? దళితులు వేరే మతాచారాలు పాటిస్తే రిజర్వేషన్లు వర్తించవని చెప్పడం వారిని బానిసలుగా ఉంచాలనే కుట్రలో భాగమే. గుళ్లోకి రానివ్వరు, బయట గౌరవం ఇవ్వరు, పోనీ హక్కుల కోసం పోరాడితే మతం అడ్డుపెట్టి అణచివేస్తారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15కు అవమానం" అని దుయ్యబట్టారు. కుందాలపల్లి ఘటన - పోలీసుల తీరుపై మండిపాటు: ఇటీవల కుందాలపల్లిలో జరిగిన అమానుష ఘటనను ప్రస్తావిస్తూ, శవయాత్రను అడ్డుకున్నది పదుల సంఖ్యలో ఉన్నప్పటికీ కేవలం 10 మందిపైనే కేసులు నమోదు చేయడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. నేటికీ తాగే నీళ్ల కోసం, గౌరవప్రదమైన అంత్యక్రియల కోసం దళితులు పోరాడాల్సి రావడం దేశానికే సిగ్గుచేటన్నారు.రాజకీయ పక్షాల మౌనం: ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా దళితుల ఆవేదనను, హక్కులను చిత్తశుద్ధితో పట్టించుకోవడం లేదని నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలకు జెండాలు మోసేది దళిత, బహుజనులేనని, కానీ అధికారం దగ్గరకు వచ్చేసరికి వారి గొంతు నొక్కేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా దళిత, బహుజన సమాజం మేల్కొని తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**
**రామగుండంలో వేలాది మందికి ఇళ్లు, స్థలాల మంజూరు**
**అసెంబ్లీలో స్పష్టీకరణ**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**



నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలిపారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.రామగుండం నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా 400 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామని, వారికి ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు.రాష్ట్రంలో తొలిసారిగా 53 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల పట్టాలు అందజేసినట్లు తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట భారీగా ఖర్చు చేసినప్పటికీ అవి అనేక ప్రాంతాల్లో నిరుపయోగంగా మిగిలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో సింగరేణి, జెన్‌కో భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి సుమారు 18 వేల వరకు వైఎస్ఆర్ ఇళ్ల పట్టాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంకా 7 వేల మందికి ఇవ్వాల్సి ఉందని, అదనంగా 11 వేల మంది నిరుపేదలను గుర్తించి వారికి ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి కాలనీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.దఅర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# మెడికల్ బోర్డు నిలిపివేతపై ఏఐటీయుసి ఆగ్రహం

**ఓపెన్ కాస్ట్ టెండర్ల అవినీతిపై చర్యలు ఎందుకు లేవు?**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

మెడికల్ బోర్డు పేరుతో విజిలెన్స్, ఏసీబీ కేసులు నమోదు చేసి బోర్డును నిలిపివేయడంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఏఐటీయుసి తీవ్రంగా ఖండించింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో జరుగుతున్న టెండర్ల అవినీతిపై మాత్రం ఎందుకు కేసులు నమోదు చేయడంలేదని ప్రశ్నించింది.బుధవారం సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో నిర్వహించిన "సేవ్ సింగరేణి పోరు జాత" గేట్ మీటింగ్‌లలో ఏఐటీయుసి నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ---కార్మికుల అనారోగ్య సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డును గతంలో అవినీతి జరిగిందనే పేరుతో నిలిపివేయడం అన్యాయమని విమర్శించారు.అవినీతి జరిగి ఉంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. కానీ మొత్తం బోర్డును రద్దు చేసి, కష్టపడి బొగ్గు తవ్వే కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.మార్చి 24న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను కూడా వారు తీవ్రంగా ఖండించారు. కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో మెడికల్ బోర్డు ద్వారా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు.కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే మెడికల్ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వం, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జనగామ సమస్యల పరిష్కారానికి వినతి పత్రం

**మేయర్, కమిషనర్‌లకు కార్పొరేటర్ శ్యామని రమేష్ విజ్ఞప్తి**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

జనగామ గ్రామం (6వ డివిజన్) పరిధిలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ మేయర్ మహంకాళి స్వామి, ఇంచార్జి కమిషనర్ అరుణ శ్రీలకు వినతి పత్రం సమర్పించారు.బుధవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ బడ్జెట్ సమావేశంలో ఈ వినతి పత్రాన్ని అందజేసిన ఆయన, డివిజన్‌లోని పలు కీలక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దడ్రైనేజీ వ్యవస్థలో భాగంగా గ్రామంలోని అన్ని వాడల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న ఓపెన్ డ్రైనేజీలను ప్రత్యేక డ్రైవ్ ద్వారా శుభ్రం చేయాలని కోరారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానంగా సెప్టిక్ ట్యాంకులు నిర్మించాలని సూచించారు.విద్యుత్, లైటింగ్ సమస్యలపై మాట్లాడుతూ జనగామ కమాన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, కొత్త విద్యుత్ స్తంభాలు వేయడంతో పాటు పాత స్తంభాలకు కనెక్షన్లు ఇచ్చి లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు శివాలయం, హనుమాన్, పోచమ్మ, కామాక్షి, పెద్దమ్మ, ఎల్లమ్మ దేవాలయాలు, గ్రంథాలయానికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.మౌలిక సదుపాయాల పరంగా మహిళా సంఘాల కోసం ప్రత్యేక భవనం నిర్మించడంతో పాటు చెరువు కట్ట వెడల్పు చేసి లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోచమ్మ దేవాలయం వద్ద బతుకమ్మ ఘాట్, స్మశాన వాటికలో దినకర్మల కోసం షెడ్డు నిర్మించాలని కోరారు. క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు.అలాగే మూతపడిన ఆర్‌ఓ ప్లాంట్‌ను పునఃప్రారంభించి సర్కార్ బావులను పునరుద్ధరించాలని, ఎల్లమ్మ గుడి, ధోబీ ఘాట్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మన్నతో పాటు పార్టీ నాయకులు జనగామ మహేందర్, ఆరెల్ల రవితేజ, జనగామ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మతం మారితే ఎస్సీ హక్కులు వర్తించవు

**సంతోష్ మహారాజ్**
**సుప్రీంకోర్టు తీర్పుపై అవగాహన కార్యక్రమం**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

మత మార్పిడి అనంతరం ఎస్సీ హోదా, దానికి సంబంధించిన రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్టీపీసీ మేడిపల్లి కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె రాజు ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భూష్పక సంతోష్ మహారాజ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని 1950 షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వు ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికే ఎస్సీ హోదా వర్తిస్తుందని తెలిపారు. ఇతర మతాలకు మారిన వారు ఎస్సీ హక్కులు కోల్పోతారని, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు.ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మత మార్పిడి జరిగిన తర్వాత కుల ధృవీకరణ పత్రం ఉన్నప్పటికీ ఎస్సీ హోదా వర్తించదని కోర్టు తేల్చి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మిట్టపల్లి సతీష్ కుమార్, ఈదునూరి చిరంజీవి, దుర్గం తిరుపతి, సిలివేరి అంజి తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి కోట అభివృద్ధిపై ఎంపీ గళం

**పార్లమెంట్‌లో ప్రస్తావనకు హర్షం**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామగిరి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్‌లో ప్రస్తావించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఓదెల మండలం మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, కరుణ సేవా సంస్థ వ్యవస్థాపకులు బచ్చల్లి రాజయ్య మాట్లాడుతూ---రామగిరి కోట పూర్వీకుల శౌర్యానికి, శిల్పకళా వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రస్తుతం కోట పరిధిలోని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ ప్రాంతంలో లభించే అరుదైన ఔషధ మొక్కలు ఆయుర్వేద రంగానికి ఉపయోగకరమని తెలిపారు. ప్రకృతి సోయగాలతో అలరారే ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మేరా గావ్--మేరీ ధరోహర్' పథకం కింద రామగిరి కోటను చేర్చి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రామగిరి కోట అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు రావాలని, ఎంపీ వంశీకృష్ణ చొరవతో కోట రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరెడ్డి వీరరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోసిక రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

**ఇద్దరికీ జైలు శిక్ష.. 37 మందికి జరిమానా**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 39 మందిని బుధవారం స్థానిక కోర్టులో హాజరుపర్చగా, ఇద్దరికీ జైలు శిక్ష విధించబడింది.దవిచారణ జరిపిన సెకండ్ క్లాస్ ఇన్‌చార్జి జడ్జి మంజుల, పెద్దపల్లి శాంతినగర్‌కు చెందిన నల్గొండ కోటేశ్వర్ (45)కు 2 రోజుల జైలు శిక్ష, తమిళనాడు రాష్ట్రం కరూర్ జిల్లాకు చెందిన ఎస్. జగదీష్ (50)కు 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మిగతా 37 మందికి మొత్తం రూ.36,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, అలాంటి ఘటనలను నివారించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించవద్దని ప్రజలకు సూచించారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**"అరైవ్--అలైవ్" ఫేజ్--3లో భాగంగా చర్యలు**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "అరైవ్--అలైవ్" ఫేజ్--3 కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పెద్దపల్లి బస్ స్టాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు.ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులు, ఆటో డ్రైవర్లు, బైక్ రైడర్లు, పాదచారులకు రోడ్డు నిబంధనలపై వివరంగా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ---రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత కీలకమని, నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సీట్‌బెల్ట్ వినియోగించుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని హెచ్చరించారు.

అధిక వేగం ప్రమాదాలకు దారితీస్తుందని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజవర్ధన్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన పెంపు

**సురక్షిత డ్రైవింగ్ అలవాట్లు అలవరచుకోవాలి**
**డీసీపీ బి. రామ్ రెడ్డి**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు "అరైవ్--అలైవ్" ఫేజ్--3 కార్యక్రమంలో భాగంగా రామగుండం రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ హాజరై ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ---రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అధిక ప్రయాణికులను ఎక్కించకూడదని, వేగ పరిమితులను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపినప్పుడు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, సురక్షిత డ్రైవింగ్ అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**
**రామగుండంలో వేలాది మందికి ఇళ్లు, స్థలాల మంజూరు**
**అసెంబ్లీలో స్పష్టీకరణ**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలిపారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. రామగుండం నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా 400 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామని, వారికి ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా 53 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల పట్టాలు అందజేసినట్లు తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట భారీగా ఖర్చు చేసినప్పటికీ అవి అనేక ప్రాంతాల్లో నిరుపయోగంగా మిగిలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.దమాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో సింగరేణి, జెన్‌కో భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి సుమారు 18 వేల వరకు వైఎస్ఆర్ ఇళ్ల పట్టాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంకా 7 వేల మందికి ఇవ్వాల్సి ఉందని, అదనంగా 11 వేల మంది నిరుపేదలను గుర్తించి వారికి ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి కాలనీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

